RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

ఉచిత కుట్టు మిషన్‌ల పంపిణీని ప్రారంభించిన మంత్రి పొన్నం 2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 194 | ఆగస్టు 14 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 194 | August 14 Fryday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

# రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి రెట్టింపు

### తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ జనసంఘర్షణ**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే తమ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి రెట్టింపు స్థాయికి చేరాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు మొదటి విడతలో భాగంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన భారీ అప్పులను తీరుస్తూనే, ప్రజలకు అందించే సంక్షేమాన్ని పెంచుకుంటూ పోతున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులపై సీఎం తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రం ఎండిపోవాలని వారు కుట్రలు పన్నారని, అధికారంలో ఉన్న సమయంలో చేయని అభివృద్ధిని పక్కన పెట్టి క్షుద్రపూజలు, చేతబడుల బాట పట్టారని ఆరోపించారు. అయితే వారి చేతబడులు వారికే తిరగబడి ఫామ్‌హౌస్‌లకే పరిమితమయ్యేలా చేశాయని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వ ఆశయం స్వచ్ఛమైనది కాబట్టే రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ. 12 వేల కోట్లు కేటాయించామని, స్వయం సహాయక సంఘాలకు రూ. 65 వేల కోట్ల రుణాలు అందించడంతో పాటు 1,000 ఆర్టీసీ బస్సులను కేటాయించామని తెలిపారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ, 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ వంటి బృహత్తర కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. నిరుపేదల స్థలాలకు సంబంధించి 22-ఏ నిషేధిత జాబితాలో పొరపాటున చేరిన భూముల సమస్యను సబ్ నంబర్లు కేటాయించి త్వరలోనే పరిష్కరిస్తామని, బాధితులకు న్యాయం చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

# విజయవాడ టూ కాశీ

### విమాన సర్వీస్ ప్రారంభం




**విజయవాడ జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ విజయవాడ నుంచి వారణాసి (కాశీ)కి నేరుగా నూతన విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చింది. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రారంభమైన ఈ ఇండిగో విమాన సర్వీసును కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వారానికి మూడు రోజుల పాటు (మంగళ, గురు, శనివారాలు) ఈ విమానాలు నడవనున్నాయి. ఈ కొత్త సర్వీస్ వల్ల రాష్ట్రం నుంచి కాశీ క్షేత్రానికి వెళ్లే ఆధ్యాత్మిక యాత్రికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు రవాణా సౌకర్యం మరింత సులభతరం కానుంది. దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలను ప్రధాన పట్టణాలతో అనుసంధానించడమే తమ ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని, అందులో భాగంగానే ఈ ప్రాంతీయ విమాన కనెక్టివిటీని బలోపేతం చేస్తున్నామని కేంద్రమంత్రి వెల్లడించారు. ఈ నిర్ణయం ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడమే కాకుండా ప్రాంతీయ పురోగతికి ఎంతగానో తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ఏపీలో పర్యాటక రంగానికి సరికొత్త ఊపిరి పోసేందుకు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయాలను అనుసంధానిస్తూ 'సీ ప్లేన్' ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చేందుకు వ్యూహరచన చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా మరియు ఇండిగో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై జాప్యం తగదు

### సుప్రీం కోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు కలిగిన ఆహార పదార్థాల ప్యాకెట్లపై స్పష్టమైన లేబుల్స్ వేసే ప్రక్రియలో ఆలస్యం వహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి, భారత ఆహార భద్రత ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కి సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిల్లల ఆరోగ్యం, ప్రజారోగ్యానికి సంబంధించిన అంశాల్లో

➤ మిగతా 2వ పేజిలో..

# ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుపుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది కల్లా నిరుపేద మహిళలతో బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కూకట్‌పల్లిలో నిర్వహించిన శంకుస్థాపన సభకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడారు. నగరంలో ఎకరం స్థలం విలువ దాదాపు రూ. 200 కోట్లు ఉన్నప్పటికీ, నిరుపేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో కార్పొరేట్ టవర్లకు సమానంగా ఇందిరమ్మ ఇళ్ల టవర్లను ప్రభుత్వం నిర్మిస్తోందని వెల్లడించారు. గత ప్రభుత్వం కమిషను

➤ మిగతా 2వ పేజిలో..

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం రోజున ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా సభ్యులంతా కలిసి 'వందేమాతరం' గేయ పరిపూర్ణ రూపంలోని ఆరు చరణాలను ఆలపించారు. వందేమాతరం గేయానికి చట్టపరమైన రక్షణ కల్పించే బిల్లుకు ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన నేపథ్యంలో లోక్‌సభలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ కొత్త చట్టం ప్రకారం జాతీయ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం శిక్షార్హమైన నేరంగా పరిగణించబడుతుంది, తద్వారా వందేమాతరానికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా దక్కింది. అధికారిక కార్యక్రమాలు, త్రివర్ణ

➤ మిగతా 2వ పేజిలో..

# తక్కువ ధరలోనే బొగ్గు

### కేంద్ర గనుల, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడి



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

దేశవ్యాప్తంగా బొగ్గు రంగానికి సంబంధించి పారదర్శకతను పెంచేందుకు, వినియోగదారులకు తక్కువ ధరలోనే విద్యుత్ అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని కేంద్ర గనుల, బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్పష్టం

➤ మిగతా 2వ పేజిలో..

# ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు

**మొదటిపేజీ తరువాయి..** రావనే ఉద్దేశంతోనే పేదల ఇళ్ల నిర్మాణాన్ని పక్కన పెట్టి కాళేశ్వరం వంటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ మహానగరంలో తొలి విడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని నిర్దేశించామని, ఇప్పటివరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని మంత్రి తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయ్యాక, మంత్రులు లేదా ఎవరి సిఫార్సులకు తావులేకుండా అందరి సమక్షంలో పారదర్శకంగా 'లక్కీ డిప్' ద్వారానే లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ముందే తమ ఇళ్ల వివరాలు తెలుసుకుని నాణ్యతను పరిశీలించుకోవచ్చని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల గృహప్రవేశాలు పూర్తయ్యాయని, గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మూడింతలు ఎక్కువ ఇళ్లను నిర్మించి తీరుతామని, అలా చేయకపోతే తాను అసెంబ్లీకి పోటీ చేయనని పునరుద్ఘాటించారు. అలాగే కూకట్‌పల్లి ప్రాంతంలో నిషేధిత జాబితా (22-ఎ)లో ఉన్న భూములు ప్రభుత్వానివి కాకపోతే, రెండు రోజుల్లోనే ఆ నిషేధాన్ని తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# 100 శాతం సబ్సిడీతో ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్ల పంపిణీ

**సెక్రెటేరియట్‌లో ప్రారంభించిన మంత్రి పొన్నం**



తెలంగాణలోని బీసీ మహిళలను ఆర్థికంగా సాధికారత వైపు నడిపిస్తూ, వారి స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. 100 శాతం సబ్సిడీతో ఉచిత ఆటోమేటిక్ కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో అధికారికంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీ మహిళలను కేవలం పథకాల లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా, వారిని స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రజాపాలన యొక్క ముఖ్య ఉద్దేశమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 119 శాసనసభా నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున, మొత్తంగా 1,19,000 కుట్టుమిషన్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఒక్కో మిషన్ విలువ సుమారు రూ. 12,000 కాగా, లబ్ధిదారులపై పైసా భారం పడకుండా పూర్తిగా ఉచితంగా (100% సబ్సిడీ) వీటిని అందజేస్తామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించి అర్హులైన బీసీ మహిళల నుంచి ఆగస్టు 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

## విజయవాడలో తిరంగా ర్యాలీ

**కార్యక్రమంలో పాల్గొన్న వెయ్యిమంది విద్యార్థులు**

**విజయవాడ** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులతో సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశా, సీపీ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో భాగంగా మెగా ర్యాలీ నిర్వహించామని తెలిపారు. అన్ని రంగాల ప్రజలను మమేకం చేస్తూ, రానున్న 21 సంవత్సరాల్లో ఊరు, రాష్ట్రం, దేశం ఎలా ఉండాలనే ఆలోచనతో 'నేను నా లక్ష్యం' కోసం పని చేస్తాను అనే సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములై 'పార్ట్నర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. 80 సంవత్సరాలుగా ఆగస్టు15న ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామని సీపీ రాజశేఖర్ బాబు అన్నారు. ప్రజలందరినీ మమేకం చేసి, అందరిలో దేశభక్తిని పెంపొందించేలాగా పలు కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగానే తిరంగా ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. 2047 లక్ష్యాలకు అనుగుణంగా అందరం ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు. దేశ పౌరులందరూ నడుంకట్టి, మంచి సమాజం కోసం పాటుపడాలని సీపీ రాజశేఖర్ బాబు పేర్కొన్నారు.

## 25.970 కేజీల గంజాయి పట్టివేత

**కారులో తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**

**రాజమండ్రి :** రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో 25.970 కేజీల గంజాయి పట్టుబడింది. ఏజెన్సీ ప్రాంతం సీలేరు నుంచి విజయవాడ వెళ్తున్న కారులో గంజాయిని పోలీసులు గుర్తించారు. మూడు పాలిథిన్ సంచుల్లో 25.970 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.4.29 లక్షలు ఉంటుందని అంచనా. అలాగే, గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం సారిప్లలెకు చెందిన దులపల్లి సుజీవ్ కుమార్, మోదుగు నరేష్‌గా గుర్తించారు. విచారణలో నిందితులు చెప్పిన సమాచారం మేరకు, విజయవాడలో గంజాయి తీసుకునే వ్యక్తి చినమ్సెట్టి రాజేష్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. గంజాయి సేకరించిన సీలేరు సమీపంలోని చింటు అనే వ్యక్తి పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై రాజానగరం పోలీసులు కేసు

# ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

**మొదటిపేజీ తరువాయి..** పతాకావిష్కరణ సమయాల్లో దీనిని ఆలపించాలని కేంద్ర హోంశాఖ ఇప్పటికే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. జూలై 20న ప్రారంభమైన ఈ వర్షాకాల సమావేశాలు అనేక రాజకీయ గందరగోళాలు, రసాభాసల నడుమ సాగాయి. నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యుత్, విద్యాశాఖల బాధ్యతలకు సంబంధించి ప్రతిపక్షాల ఆందోళనలు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన 'చలో పార్లమెంట్' యాత్ర తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. పెరిగిన ఒత్తిడి కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో సభలో నిరంతరం వాయిదాల పర్వం నడిచింది. తీవ్ర ఆటంకాలు ఎదురైనప్పటికీ, పేపర్ లీకేజీలను అరికట్టే యాంటీ పేపర్ లీక్ బిల్లుతో పాటు పలు కీలక చట్టసభ బిల్లులకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. చివరకు వందేమాతర గీతాలాపన అనంతరం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడటంతో ఈ దఫా సమావేశాలు ముగిసాయి.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి**

**విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి**

**అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**

**హైదరాబాద్, :** రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ÷ర్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూటమి అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

**నక్కపల్లిలో పర్యటించిన హోంమంత్రి అనిత**

**అనకాపల్లి, ఆగస్ట్13 :** ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత అనకాపల్లి జిల్లాలోని నక్కపల్లిలో గురువారం పర్యటించారు. నక్కపల్లిలో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. అనితకు అడుగడుగున హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోం మంత్రి ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అనంతరం ఇటీవల మృతిచెందిన విద్యార్థి వరహాలు బాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరహాలు బాబు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆ విద్యార్థి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హోం మంత్రి అనిత భరోసా ఇచ్చారు.

# తక్కువ ధరలోనే బొగ్గు

**మొదటిపేజీ తరువాయి..** చేశారు. త్వరలోనే ప్రత్యేకంగా 'కోల్ ఎక్స్ఛేంజ్'ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా దేశమంతటా బొగ్గుకు ఒకే విధమైన ప్రామాణిక ధర ఉండే అవకాశం లభిస్తుందని, ఫలితంగా విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి సామాన్య ప్రజలకు సైతం భారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత 2018వ సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం బొగ్గు ధరలను ఏమాత్రం పెంచలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. విద్యుత్ రంగంతో పాటు సిమెంట్, స్టీల్ వంటి ఇతర కీలక పారిశ్రామిక రంగాలు సైతం ముడి పదార్థాల ధరల భారాన్ని ఎదుర్కోకుండా తగిన నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని కేంద్రమంత్రి తెలిపారు. దేశంలో ఖనిజ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అయితే ఈ ప్రక్రియలో రాష్ట్రాల ప్రాధాన్యతను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించబోమని హామీ ఇచ్చారు. మినరల్స్ నిర్వహణతో పాటు పన్నులు, సెస్‌ల వసూలు విషయంలో రాష్ట్రాలకు ఉన్న రాజ్యాంగబద్ధమైన హక్కులు, అధికారాలలో కేంద్రం జోక్యం చేసుకోదని తేల్చి చెప్పారు. రాష్ట్రాల హక్కులను పరిరక్షిస్తూనే, దేశీయ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందిస్తుందని వివరించారు.

# పిల్లల ఆరోగ్యంపై జాప్యం తగదు

**మొదటిపేజీ తరువాయి..** ఏమాత్రం జాప్యం తగదని, కార్పొరేట్ కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గకూడదని తేల్చి చెప్పింది. ఈ విషయంలో విమర్శలు గుప్పిస్తూ, ఒకవేళ ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోతే ఆ బాధ్యతను తామే భుజానికెత్తుకుని ఉత్తర్వులు ఇస్తామని జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. వినియోగదారులు కొనుగోలు చేసే ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల్లో ఎలాంటి పదార్థాలు ఎంత పరిమాణంలో ఉన్నాయో ముందే తెలుసుకునే హక్కు వారికి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. హెచ్చరిక లేబుల్స్ వేస్తే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని తయారీదారులు చెప్పే సాకులను కోర్టు తోసిపుచ్చింది. ప్యాకెట్ ముందు భాగంలోనే స్పష్టమైన లేబుల్స్ ఉన్నప్పటికీ, దానిని కొనాలా వద్దా అనేది వినియోగదారుడి వ్యక్తిగత నిర్ణయమని వ్యాఖ్యానించింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదించిన కేవలం సమాచార పట్టికల విధానం కంటే, ముందస్తుగా హెచ్చరించే లేబుల్స్ వల్లనే స్పష్టమైన అవగాహన వస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ హెచ్చరిక లేబుళ్ల ప్రతిపాదనపై తగిన నిర్ణయం తీసుకోవడానికి కేంద్రానికి రెండు వారాల గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు, తదుపరి విచారణ నాటికి పురోగతి లేకపోతే తుది ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది.

## ప్రజలకు జవాబుదారులుగా అధికారులు

**అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి**

**సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టుకోవాలి**

**రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి**

**హైదరాబాద్ :** ప్రజలకు జవాబుదారులం అనే విషయాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండలస్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని

# వర్ని వద్ద 39.849 కిలోల గంజాయి పట్టివేత

**❑ చంద్రభాను, రాజు పరారీ.. ప్రధాన నిందితుడు అరెస్ట్**

వర్ని, /ఆగస్టు 13:/జనసంఘర్షణ)

గంజాయి అక్రమ రవాణాపై వర్ని పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. మల్లారం తాండా సబ్‌స్టేషన్ సమీపంలోని నసురుల్లాబాద్--వర్ని రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 39.849 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనం, ఒక సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆగస్టు 11న మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు గంజాయిని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వర్ని పోలీసులు మల్లారం తాండా సమీపంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా మూడు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా, ఒక ద్విచక్ర వాహనం అదుపుతప్పింది. దానిపై ఉన్న గంజాయి మూటను వదిలి ఇద్దరు వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం పోలీసులు వదిలివెళ్లిన మూటను తనిఖీ చేయగా ప్లాస్టిక్ కవర్లలో మొత్తం 39.849 కిలోల గంజాయి లభించింది. అక్కడ పట్టుబడిన వ్యక్తిని విచారించగా అతడు కామారెడ్డి జిల్లా పెద్దకొడపగల్ మండలం పోచారం తాండాకు చెందిన బిబర్దవల్ గోబ్రియా (26)లిగా


ప్రెస్ నోట్

తేదీ: 12-08-2026

1) Cr. No. 189/2026 U/S 8(c) r/w 20 (b) (ii) (C) , 29 of NDPS ACT-1985, OF PS Varni
2) నిందితులు: A1- బర్దవల్ గోబ్రియా S/o ధీర, వయస్సు: 26 సం., కులం: కాయితి లాంబాడ, వృత్తి: వ్యవసాయం R/o పోచారం తాండా, పెద్ద కోడపగల్ మండలం, కామారెడ్డి జిల్లా
A2- చంద్ర భాను R/o పోచారం గ్రామం
A3- రాజు
A4- మథుర్ సింగ్ R/o నగళూర్ తాండా గ్రామం , గాంధారి మండలం
A5- మథుర్ మోహన్ సింగ్ R/o నగళూర్ తాండా గ్రామం , గాంధారి మండలం
A6- సబలే నారాయణ R/o జగన్నాథ పల్లి గ్రామం , బిచ్కుంద మండలం
A7- రామ్ సింగ్ R/o పోచారం తాండా గ్రామం, పెద్ద కోడపగల్ మండలం
3) స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు: 39.849 కిలోల గంజాయి, ఒక బైకు,ఒక మొబైల్ ఫోను
4) కేసు వివరాలు: నిన్న అనగా తేదీ 11 .08 .2026 నాడు మద్యానము అందాజ 02:30 గంటల సమయాన ముగ్గురు వ్యక్తులు గంజాయిని తెసుకువస్తున్నారు అని సమాచారము మేరకు వర్ని పోలీస్ వారు, మల్లారం తాండా వద్ద గల సబ్ స్టేషన్ ముందర గల నసురుళ్ళబాద్ వర్ని రోడ్డు వద్ద vehicle చెకింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు మోటార్ సైకిల్ ల మీద వేరువేరుగా అనుమాన స్పదముగా వస్తు కనిపించదముతో వారిని పట్టుకొనే ప్రయత్నం చేయగా ముందర మోటార్ సైకిల్ మీద గల వ్యక్తి తప్పిచ్చుకొనే ప్రయత్నం చేయగా అతని మోటార్ సైకిల్ అడుపుతప్పగా వెనకాల గంజాయి పట్టుకొని కూర్చున్న వ్యక్తి అట్టి మూటను వదిలి వెనకాల మోటార్ సైకిల్ మీద వస్తున్న వ్యక్తి తో కలిసి వెంకలకే పాయిపోయినారు. ముందర మోటార్ సైకిల్ వద్దకు వెళ్ళి అతని వద్ద గల మూటను చెక్ చేయగా అతి సంచిలో ఉన్న ప్లాస్టిక్ కవర్ లను చెక్ చేయగా మొత్తం 39.849 కిలోల గంజాయి దొరికినది. ఇట్టి వ్యక్తిని విచారించగ పోచారం తాండా, పెద్ద కోడపగల్ మండలం, కామారెడ్డి జిల్లా కి చెందిన బర్దవల్ గోబ్రియా గత కొన్ని సంవత్సరాల నుండి తన స్నేహితులు అయిన చంద్ర భాను, రాజు లతో కలిసి మథుర్ సింగ్, మథుర్ మోహన్ సింగ్ , సబలే నారాయణ , రామ్ సింగ్ ల వద్ద కొని అమ్ముతూ ఉంటారు. అదే విధముగా వారు అమ్ముతున్న గంజాయి వలన వచ్చే డబ్బులు వారి విలాసాలకి సరిపోతలెవని, పెద్ద మొత్తం లో అమ్ముదామని మథుర్ సింగ్, మథుర్ మోహన్ సింగ్ ల వద్ద నుండి 20 కిలోల గంజాయి, సబలే నారాయణ వద్ద 10 కిలోల గంజాయి , రామ్ సింగ్ ల వద్ద వద్ద 10 కిలోల గంజాయి మొత్తం 40 కిలోలు 2,00,000/- లకు కొని అట్టి దానిని బడపహాడ్ ఏరియాలో అమ్ముదామని వారి యొక్క మోటార్ సైకిల్ పైనా వస్తుండగా వారిని పట్టుకునే క్రమములో చంద్రభాను మరియు రాజులు పారిపోగా గోబ్రియా ను పట్టుకొని అతని నుండి మొత్తం 39.849 కిలోల గంజాయి మరియు మోటార్ సైకిల్ TS 17 L 6073, VIVO మొబైలు ఫోన్ లను స్వాదినపర్చుకున్నాము.

చంద్రభాను రాజులు మరియు వీరికి గంజాయి సప్లై చేసిన మథుర్ సింగ్, మథుర్ మోహన్ సింగ్ , సబలే నారాయణ , రామ్ సింగ్ లు ప్రస్తుతం పరాలిలో ఉన్నారు. అట్టి వ్యక్తుల పైనా కూడా కేసు నమోదు చేయడం జరిగింది.

ఇట్టి కేసు దర్యాప్తునకు సహకరించిన ఏసీపీ సీసీఎస్ శ్రీశైలం, ఎసిపి బోధన్ పి. శ్రీనివాస్, రుద్రూరు సిఐ కృష్ణ కోటగిరి యస్. ఐ. శ్రీనివాస్, రుద్రూర్ యస్.ఐ. మనోజ్, సి.సి.యస్. యస్.ఐ. శ్రీనివాస్ మరియు ఈగల్ టీం మరియు చీత ఫోర్స్ సిబ్బందిని సిపి గారు అభినందించడం జరిగింది. ఇట్టి మొత్తం 39.849 కిలోల గంజాయి సొత్తు విలువ అందాజ 1,99,245/- గ ఉంటది.

కావున పత్రిక మిత్రులకు, ప్రజలకు తెలపునది ఏమనగా ఇలాంటి నిషేధిత మత్తు పదార్థాలు , మాదక ద్రవ్యాలను అమ్మిన గాని సరపర చేసిన గాని చట్ట పరము అయిన కఠిన చర్యలు తెసుకొనబడును అలాగే ఏదాయిన వీటికి సంబందిచినా సమాచారము ఉన్న గాని పోలీస్ వారికి గాని టోల్ ఫ్రీ No 1908 గాని తెల్పగాలరు.

ఇట్లు
ACP Bodhan




గుర్తించారు. విచారణలో గోబ్రియా తన స్నేహితులు... చంద్రభాను, రాజుతో కలిసి గంజాయి కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే మథుర్ సింగ్, మథుర్ మోహన్ సింగ్, సబలే నారాయణ, రామ్ సింగ్ వద్ద నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రస్తుతం చంద్రభాను, రాజుతో పాటు గంజాయి సరఫరా చేసినట్లు గుర్తించిన నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు: 39.849 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం (టీఎస్ 17 ఎల్ 6073), ఒక వివో సెల్‌ఫోన్. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ. 1,99,245గా పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో సహకరించిన ఏసీపీ సీసీఎస్ శ్రీశైలం, ఏసీపీ బోధన్ పి. శ్రీనివాస్, రుద్రూరు సీఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్, రుద్రూరు ఎస్ఐ మనోజ్, సీసీఎస్ ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు ఈగల్ టీం, చీతా ఫోర్స్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

**అధికారుల హెచ్చరిక..**

నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించినా, రవాణా చేసినా, సరఫరా చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీపీ బోధన్ పి. శ్రీనివాస్ హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

# దివ్యాంగులకు సౌకర్యాలను మెరుగుపరచాలి

**❑ కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్**

హైదరాబాద్/ఆగస్టు13/జన సంఘర్షణ):

దివ్యాంగులకు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత పెంచడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రదేశాల్లో వారికి అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డా. వీరేంద్ర కుమార్ను ఎంపీ అర్వింద్ కలిసి నిజామాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం, సాధికారతకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వారికి అందుతున్న సంక్షేమ పథకాలు, సహాయక పరికరాల పంపిణీ, ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయాల్సిన అవసరాన్ని వివరించారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, వినికిడి పరికరాలు, కృత్రిమ అవయవాల కోసం నిర్వహించే అంచనా శిబిరాలను మరింత విస్తరించాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే దివ్యాంగులకు విద్య, ఉపాధి అవకాశాలతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తే వారు స్వావలంబన సాధించేందుకు మరింత అవకాశం ఉంటుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, ఇతర ప్రజా ప్రదేశాల్లో దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుబాటు సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగుడికి చేరేలా కృషి చేస్తున్నామని ధర్మపురి అర్వింద్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ అర్వింద్ చేసిన విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి డా. వీరేంద్ర కుమార్ సానుకూలంగా స్పందించారు. దివ్యాంగుల సంక్షేమం, సాధికారత కోసం అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు మరింత విస్తృతంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# ఈనాడు రిపోర్టర్ సాయిలు అన్నకి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

పోతంగల్, /ఆగస్టు 13/జన సంఘర్షణ:

ఉమ్మడి కోటగిరి-- పోతంగల్ మండలాల ఈనాడు రిపోర్టర్ సాయిలు అన్న జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పొతంగల్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యాయుడు గంధపు దత్తు సాయిలు అన్నకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సాయిలు అన్న పుట్టినరోజు.... ఆయన జీవితంలో మరెన్నో సంతోషాలు, విజయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.ప్రజా సమస్యలను సమాజం దృష్టికి....: తీసుకురావడంలో, ప్రజల గొంతుకగా నిలుస్తూ వాస్తవాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో సాయిలు అన్న పాత్ర అభినందనీయమని దత్తు పేర్కొన్నారు. జర్నలిజం రంగంలో ఆయన అందిస్తున్న సేవలు మరింత విస్తరించి, మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. "మీ కలం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలవాలి.. మీ ప్రతి అడుగు.... విజయవైపు సాగాలి.. మీ ప్రతి కల సాకారం కావాలి.. మీ ప్రతి ప్రయత్నం విజయవంతం కావాలి.. మీ జీవితం సంతోషాలతో నిండిపోవాలి" అని శుభాకాంక్షలు తెలిపారు.ఆత్మీయతకు మారుపేరుగా.... మిత్రులందరికీ అప్పుడిగా ఉంటూ భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటూ సాయిలు అన్నగారికి మరోసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శుభాకాంక్షలతో:..గంధపు దత్తు.... ఉపాధ్యాయుడు, పొతంగల్ ప్రెస్ క్లబ్






## బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**❑ లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ 5000 రూపాయలు ఆశయ కుటుంబానికి అందజేత.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)

మెదక్ మండలం పేరూర్ గ్రామంలోని వార్డు మెంబర్ గంగని ఆశయ్య బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు.ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ కమలమ్మ, ఉప సర్పంచ్ అనిల్ కుమార్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, మాజీ ఉపసర్పంచ్ బీరయ్య, యాదగిరి, రాములు, జనార్ధన్, షేకయ్యా, రామయ్య, కిరణ్, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రాణాపాయ స్థితిలో వచ్చిన బాబుకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)

ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి తీసుకొచ్చిన నవజాత శిశువుకు వైద్యులు అందించిన చికిత్సతో కోలుకోవడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.చిన్న శంకరంపేట మండలం కామారం గ్రామానికి చెందిన పాట్లూరి శోభ-చంటి దంపతులకు ఈ నెల 5న మెదక్‌లోని ఓ ఆస్పత్రిలో బాబు జన్మించాడు.రెండు రోజుల అనంతరం బాబు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మెదక్ వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అయితే బాబు తల్లిదండ్రులు హైదరాబాద్‌కు తీసుకెళ్లకుండా రామాయంపేట పట్టణంలోని రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఈ నెల 7న డాక్టర్ ప్రదీప్ రావు నేతృత్వంలో వైద్యులు చికిత్స ప్రారంభించారు.ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాబుకు వైద్యులు ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించడంతో ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. గురువారం బాబు పూర్తిగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ బాబును రాజరాజేశ్వరి పిల్లల ఆస్పత్రికి తీసుకురాగా, డాక్టర్ ప్రదీప్ రావు అందించిన వైద్యం, సిబ్బంది సహకారంతో బాబు కోలుకున్నాడని ఆనందం వ్యక్తం చేశారు. తమ బాబుకు ప్రాణం పోసిన డాక్టర్ ప్రదీప్ రావుతో పాటు ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.




## జనాభా లెక్కలతోనే సరైన అభివృద్ధి

**❑ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)

జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ అత్యంత ప్రామాణికమైనదని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆర్డీవోలు, తాహాసిల్దార్లు,వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్ బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధమైన భవిష్యత్తు అభివృద్ధికి జనాభా లెక్కలు దోహదం చేస్తాయన్నారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగం సమగ్ర సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన 2027 సన్నాహకాల్లో మున్సిపల్, విద్య, వైద్య ఆరోగ్య,హౌసింగ్, ఆర్ అండ్ బీ వంటి వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాలు,పట్టణాల వారీగా జనాభా వివరాలు నమోదు చేయడం.మౌలిక వసతులు, విద్య, వైద్యం పౌర సౌకర్యాల సమాచారంసేకరించడం. డిజిటల్ యాప్‌లు లేదా వెబ్ పోర్టల్స్ ద్వారా ఖచ్చితమైన డేటాను క్రోడీకరించడం.రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారుల ద్వారా పర్యవేక్షణ జరపడం. చేయాలన్నారు.ఈ గూగుల్ మీట్ సమావేశం లో డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ, బవయ్య, తహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## చారిత్రక వంద స్తంభాల ఆలయానికి ఫెన్సింగ్.. వాచ్‌మెన్ నియామకం!

**❑ ఆలయ పరిరక్షణకు పురావస్తు శాఖ హామీ.. ఆక్రమణలపై సర్వేకు డిమాండ్**

నిజామాబాద్/బోధన్/, ఆగస్టు 13:/జన సంఘర్షణ)

బోధన్‌లోని చారిత్రక వంద స్తంభాల ఆలయానికి రక్షణ కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. బుధవారం తెలంగాణ పురావస్తు శాఖ అధికారులు ఆలయాన్ని పరిశీలించి, ఆలయ పరిసరాలు, భూమి పరిస్థితిపై వివరాలు సేకరించారు. చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందిన ఆలయానికి భద్రత కల్పించేందుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు వాచ్‌మెన్‌ను నియమిస్తామని పురావస్తు శాఖ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఆలయ పరిరక్షణకు మరింత భద్రత కలగనుంది. అదేవిధంగా ఆలయానికి సంబంధించిన భూమిలో ఆక్రమణలు.... ఉన్నాయా అనే అంశంపై సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు అధికారులను కోరారు. ఆలయానికి చెందిన ఎకరం పది గుంటల భూమిని పూర్తిగా పరిరక్షించి, భవిష్యత్‌లో ఎలాంటి ఆక్రమణలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యోగ్ ధారణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు.... ఉదయ్ మహారాజ్, అడ్వకేట్ సాయి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ధర్మతో పాటు పలువురు స్థానికులు అధికారులతో మాట్లాడారు.



**చారిత్రక వారసత్వాన్ని కాపాడాలి....**

వంద స్తంభాల ఆలయం బోధన్ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తున్న నేపథ్యంలో దాని పరిరక్షణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. పురాతన కట్టడాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆక్రమణలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. చారిత్రక ఆలయాల పరిరక్షణలో అధికారులు తీసుకునే చర్యలు ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవాలని స్థానికులు ఆకాంక్షించారు.

జన సంఘర్షణ
శుక్రవారం 14 ఆగస్టు 2026

# బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి రెండేళ్ల జైలు

- రూ.20 వేల జరిమాన
- సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను, సిబ్బందిని అభినంధించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)

పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడి వేధింపులకు గురిచేసిన నిందితుడికి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డ్. వి. శ్రీనివాస రావు తెలిపారు. నరేష్ (27) అనే వ్యక్తి పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని కుటుంబ సభ్యులు వెల్దుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ జులై 2022లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో సమర్పించారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా,లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలిక సాక్ష్యం చెప్పడంలో సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నరేష్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిన్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసులో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారని ఎస్పీ తెలిపారు. బాలికలు, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వేధింపులపై వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.




# ఎమ్మెల్యే తనయుడి చేతుల మీదుగా హైదరాబాద్ ఇరానీ టీ స్టాల్ ప్రారంభం

కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ) న్యూస్

సింగరేణి మండలం కారేపల్లిలో గుగులోత్ నరేష్ నూతనంగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఇరానీ టీ స్టాల్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్ ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి టీ స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని, ప్రజల ఆదరణ పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. టీ స్టాల్ నిర్వాహకుడు గుగులోత్ నరేష్ మాట్లాడుతూ కారేపల్లి ప్రాంత ప్రజలకు హైదరాబాద్ ఇరానీ టీ ప్రత్యేక రుచిని అందించాలనే ఉద్దేశంతో ఈ వ్యాపారాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన టీతో పాటు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేకే సోలార్ అధినేత జేకే మహేష్, కారేపల్లి సర్పంచ్ టోనీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన మిషన్ వాక్ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి వీడియో కాల్ ద్వారా నరేష్‌ను అభినందించారు. అలాగే జవాన్ బానోత్ దశరథ్, మిషన్ వాక్ సభ్యులు షరీఫ్, సాయి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నరేష్ సతీమణి నస్రిన్, తండ్రి రాములు, కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. అనంతరం అతిథులు ఇరానీ టీని




రుచి చూసి నూతన వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అక్షరం ఆయుధం ప్రెస్ క్లబ్ తరపున అంగోత్ రాములు, భూక్య రవీందర్ నూతన వ్యాపార నిర్వాహకుడు గుగులోత్ నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్‌ను సమీక్షించిన అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13(జన సంఘర్షణ)







స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహించనున్న పరేడ్ ఏర్పాట్లను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సమీక్షించారు. పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించిన ఆయన పోలీసు సిబ్బంది కమాండ్లకు అనుగుణంగా చేస్తున్న కదలికలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పరేడ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ పూర్తి ఉత్సాహంతో, క్రమశిక్షణతో పాల్గొనాలని సూచించారు. కవాతులో అడుగులు, టర్నింగ్‌లు, కమాండ్లకు అనుగుణంగా కదలికలు ఒకే విధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. సిబ్బంది టర్న్‌అవుట్ కూడా ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. వేడుకల్లో ఎలాంటి లోపాలకు తావులేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకోవాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)




రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఆగస్టు 15, 2026న మెదక్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఆగస్టు 15న ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ,కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి,గౌరవ వందనం స్వీకరించి,అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా తెలిపేలా ముఖ్య అతిథి ప్రసంగం నివేదిక తయారు చేస్తున్నట్టు చెప్పారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు,విద్యార్థులు, యువత మరియు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)




రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుండి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో గూగుల్ మీట్ నిర్వహించారు.జిల్లాలోని పంటల వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు,సెప్టెంబర్ మాసాలలో ఎల్ ని నో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారని, వరి పంటను సాగు చేస్తున్న రైతులు వరి సాగు కోసం ఎక్కువ నీరు అవసరం అవుతుందని,ఆగస్టు,సెప్టెంబర్ మాసాల్లో వర్షాలు తగ్గడం వల్ల వరి పంటలు ఎండిపోయే అవకాశం ఉందని,పంటలు ఎండిపోవడం వల్ల దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పరిస్థితులపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లోని గ్రామ సర్పంచులకు, రైతులకు ఆరుతడి పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, విస్తరణ అధికారుల తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి డాక్టర్ ఎంఏ హకీమ్ ఆపన్నహస్తం

పోతంగల్,) ఆగస్టు 13: /(జన సంఘర్షణ)



పేదల కష్టాల్లో తోడుగా నిలుస్తూ.. అవసరమైన వారికి తనవంతు సహాయం అందిస్తూ సామాజిక సేవలో ముందుంటున్న డాక్టర్ ఎంఏ హకీమ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామానికి చెందిన మౌలానా పాషా కుమార్తె వివాహం సందర్భంగా ఆయన ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని తెలుసుకున్న డాక్టర్ ఎంఏ హకీమ్, కుమార్తె వివాహం సజావుగా జరగాలనే ఉద్దేశంతో తనవంతు సాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. పేద కుటుంబాల కష్టాలను గుర్తించి.. ఆపద సమయంలో ఆదుకోవడమే నిజమైన సామాజిక సేవ అని ఆయన పేర్కొన్నారు. తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని వివాహ వేడుకకు ఆర్థిక సహాయం అందించిన డాక్టర్ ఎంఏ హకీమ్‌కు మౌలానా పాషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన అందించిన సహాయం తమకు ఎంతో భరోసానిచ్చిందని పేర్కొన్నారు. మానవత్వంతో చేసే చిన్న సహాయం.. ఆ కుటుంబానికి ఎంతో పెద్ద అండగా మారుతుందని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక, బిఆర్ఎస్, యూత్,నాయకులు, అప్రోచ్ ఇమ్రాన్ నాయకులు, ప్రతినిధులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడికి ఆశ్రమంలో ఆశ్రయం

- కథనంపై స్పందించిన పోలీసులు.. వృద్ధుని కోరిక మేరకు ఆశ్రమానికి తరలింపు

నిజామాబాద్, /ఆగస్టు 13:/జన సంఘర్షణ)



నిజామాబాద్ అయినవాళ్లు ఉండి అనాథగా మారిన ఓ వృద్ధుడికి పోలీసులు అండగా నిలిచారు. 'అయిన వాళ్లు ఉండి అనాథ మారిన వృద్ధుడు' అనే శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం జానకంపేటకు చెందిన చంద్రయ్య అలియాస్ రాజన్న పరిస్థితిని తెలుసుకున్న వేల్పూర్ ఎస్సై సంజీవ్ వెంటనే స్పందించారు. వృద్ధుడితో మాట్లాడి ఆయనకు అవసరమైన సహాయం అందించే చర్యలు చేపట్టారు. వృద్ధుడి కోరిక మేరకు డిమ్పల్లి మండలం రాంపూర్‌లోని వృద్ధుల ఆశ్రమానికి చంద్రయ్యను తీసుకెళ్లి అక్కడ ఆశ్రయం కల్పించారు. దీంతో కొంతకాలంగా ఆదరణ కోసం ఎదురుచూస్తున్న వృద్ధుడికి సురక్షితమైన వసతి లభించింది. వృద్ధుడి పరిస్థితిపై కథనం ప్రచురితమైన వెంటనే పోలీసులు స్పందించి మానవత్వంతో ముందుకు రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారికి పోలీసుల సహకారం అందించడంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరూ వృద్ధులను ఆదరించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. కాగా, వృద్ధుడికి ఆశ్రమంలో అవసరమైన వసతులు అందుతున్నాయా? అనే విషయాన్ని కూడా ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

# స్వాతంత్ర దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు

- మెదక్ ఆర్ డి ఓ రమాదేవి.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13 (జన సంఘర్షణ)



ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ ఆర్ డి ఓ రమాదేవి అన్నారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాట్లను పరిశీలించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్న ఏర్పాట్లను ఆర్డీవో పరిశీలించారు.వేడుకలు నిర్వహించనున్న ప్రదేశాన్ని సందర్శించి వేదిక, పరేడ్, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయాలని ఆర్డీవో సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు.

# సాలూరలో ఆగని ఇసుక అక్రమ రవాణా

◆ నామమాత్రపు జరిమానాలతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా?

సాలూర, /ఆగస్టు 13:/జన సంఘర్షణ)



సాలూర మండలంలో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఎప్పటికప్పుడు వాహనాలను పట్టుకుంటున్నప్పటికీ, నామమాత్రపు జరిమానాలతో వదిలేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అక్రమ ఇసుక రవాణాదారుల్లో భయం లేకుండా పోతోందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇటీవల మందర్నా వైపు నుంచి అనుమతులు లేకుండా టాటా మ్యాజిక్ వాహనంలో ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఆర్ఐ శంకర్ కాజాపూర్ వద్ద పట్టుకున్నారు. వాహనాన్ని తదుపరి చర్యల కోసం తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. అయితే పట్టుబడిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం జరిమానాలతో సరిపెడితే అక్రమ రవాణా ఎలా ఆగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**అధికారుల హెచ్చరికతోనే ఆగేనా.. చర్యలు తప్పనిసరి!**

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలంటే కేవలం వాహనాలు పట్టుకోవడం, జరిమానాలు విధించడం సరిపోదని ప్రజలు అంటున్నారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిని గుర్తించి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సాలూర తహసీల్దార్ ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుకను తరలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేస్తున్నారు.

# వై జంక్షన్ మూసివేతకు చర్యలు ప్రారంభం

◆ బీజేపీ సుదీర్ఘ పోరాటం ఫలితం.
◆ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నమైన శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు అన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 13(జన సంఘర్షణ)

రామాయంపేట పట్టణంలోని వై జంక్షన్ వద్ద తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భారతీయ జనతా పార్టీ చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా అధికారులు కీలక చర్యలు చేపట్టారు. నేడు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో బీజేపీ నాయకులు సంప్రదింపులు జరిపిన అనంతరం, జీఎంఆర్ అధికారులు లింకింగ్ లైట్స్‌ను సరిచేసి రేపటి వరకు వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేస్తామని తెలియజేశారు.ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చినమైన శ్రీనివాస్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ, వై జంక్షన్ మూసివేత వల్ల కోమటిపల్లి, గొల్లిపర్తి గ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని బీజేపీ తరపున అధికారులను కోరినట్లు తెలిపారు.ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి కోమటిపల్లి సర్వీస్ రోడ్డు, గొల్లిపర్తి సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు నిర్ణయం తీసుకొని పనులు కూడా ప్రారంభించడం అభినందనీయమన్నారు. కోమటిపల్లి నుంచి వచ్చే ప్రజలు సర్వీస్ రోడ్డు ద్వారా నేరుగా రామాయంపేటకు చేరుకునే అవకాశం ఉంటుందని, అలాగే గొల్లిపర్తి ప్రజలు సర్వీస్ రోడ్డు ద్వారా కేసీఆర్ కాలనీ ముందు నుంచి తమ పంట పొలాలకు వెళ్లే అవకాశం కలుగుతుందని తెలిపారు.ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ప్రధాన లక్ష్యంగా వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేసి ప్రమాదాలను నివారించే చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. గతంలో ఈ ప్రాంతంలో జరిగిన వరుస ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ మొదటి నుంచే జంక్షన్ మూసివేత కోసం ఉద్యమాలు, నిరసనలు, అధికారులకు వినతిపత్రాలు అందజేస్తూ పోరాటం చేసిందని గుర్తు చేశారు.ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వెంటనే స్పందించిన నేషనల్ హైవే అథారిటీ అధికారులకు, జీఎంఆర్ అధికారులకు, పోలీసు సిబ్బందికి, మున్సిపల్ అధికారులు మరియు పాలకవర్గానికి భారతీయ జనతా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో వై జంక్షన్‌ను పూర్తిగా మూసివేసి ప్రమాదాలను నివారించే దిశగా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. రామాయంపేట పట్టణ ప్రజలతో పాటు కోమటిపల్లి,



గొల్లిపర్తి గ్రామాల ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అధికారులు తీసుకున్న నిర్ణయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో కూడా ప్రజల భద్రతకు సంబంధించిన సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాడుతుందని వారు స్పష్టం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వారుఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల శేఖర్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య,యాదగిరి మోర్చా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కార్తిక్, ఓబీసీ సీనియర్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్ రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి అనిల్ ప్రవీణ్ యూమోర్చ పట్టణ అధ్యక్షులు కన్నయ్య యువమోర్చా నాయకుడు వెంకటి, సోషల్ మీడియా కన్వీనర్ శ్యామ్ యువ మోర్చా నాయకుడు బాసమ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలి

పోతంగల్, /ఆగస్టు 13/జన సంఘర్షణ:



దేశభక్తి స్ఫూర్తిని చాటుతూ పోతంగల్ మండల కేంద్రంలోని|ాపీ ాాు=× పాఠశాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు జాతీయ జెండా ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. గతంలో జాతీయ జెండాను ఎగురవేయడంపై అనేక నిబంధనలు ఉండేవని, ప్రస్తుతం ప్రతి భారతీయుడు తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకునే అవకాశం కల్పించబడిందన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని, యువతలో దేశభక్తి భావనను మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఇంటిపై తిరంగా రెపరెపలాడాలి.. ప్రతి గుండెలో దేశభక్తి నిండాలి! ...ఈ కార్యక్రమంలో పోతంగల్ మండల బీజేపీ అధ్యక్షులు కల్లూరి హన్మండ్లు (బజరంగ్), రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు మక్కయ్య, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, బీజేపీ నాయకులు పబ్బ శేఖర్, ఓమన్న పటేల్, కిరణ్ సెట్, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు అప్పచెప్పితే పోరాటం తప్పదు

మంచిర్యాల జిల్లా, చెన్నూరు మండలం, ఆగస్టు 13(జనసంఘర్షణ ):



తెలంగాణ మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయు) ఆధ్వర్యంలో చెన్నూర్, మండల్లాలోని ఎంఈఓ కార్యాలయల ఎదుట నిరసన చేపట్టి అనంతరం కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా,ఏండి కరీశీ భీ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులతో నాణ్యమైన భోజనం నిర్వహణ జరుగుతుంది. గత 15, 20 సంవత్సరాలుగా కార్మికులు పని చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా 10,000/- రూపాయలు వేతనం చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని రాష్ట్రంలోని కార్మికులు అధికారంలోకి తెచ్చారు. కానీ నేడు ఈ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వమే మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండి పెడుతున్న కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. కొన్నివేల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి మధ్యాహ్న భోజన నిర్వహణను యధావిధిగా కార్మికులతోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టక్క దుర్గక్క, భుజ మల్లక్క, విజయ, తార, కిష్టక్క, భారతక్క తదితరులు పాల్గొన్నారు.

# టాటా మ్యాజిక్‌లో అక్రమ ఇసుక రవాణా పట్టివేత

సాలూర, /ఆగస్టు 13/జన సంఘర్షణ):




సాలూర మండలంలో అక్రమ ఇసుక రవాణాపై అధికారులు నిఘా పెంచారు. ఈ క్రమంలో మందర్నా వైపు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా టాటా మ్యాజిక్ వాహనంలో ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని ఆర్ఐ శంకర్ గుర్తించి పట్టుకున్నారు. కాజాపూర్ వద్ద వాహనాన్ని అదుపులోకి తీసుకున్న అధికారులు, తదుపరి చర్యల కోసం సాలూర మండల తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేయడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారెవరినీ ఉపేక్షించేది లేదని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

# ఇల్లు కూలిపోయి గుడిలో తలదాచుకున్న నిరుపేదకు డాక్టర్ ఎంఏ హకీమ్ ఆపన్నహస్తం

పోతంగల్,/ ఆగస్టు 13/జన సంఘర్షణ):



ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తున్న డాక్టర్ ఎంఏ హకీమ్ మరోసారి వ ా న వ తా ్వ ని ్న చాటుకున్నారు. పోతంగల్ మండలంలోని పాతబస్తీకి చెందిన మైనార్టీ వర్గానికి చెందిన హబీబ్ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నారు. కుటుంబానికి అండగా నిలిచే వారు ఎవరూ లేకపోవడంతో పాటు, ఇటీవల ఆయన నివాసం కూలిపోవడంతో ఉండేందుకు ఇల్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గుడిలోనే భోజనం చేస్తూ, అక్కడే నిద్రిస్తూ కాలం వెళ్లదీస్తున్న హబీబ్ పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ ఎంఏ హకీమ్ స్పందించారు. హబీబ్‌కు తన వంతు ఆర్థిక సహాయం అందించి5.000, కష్టకాలంలో అండగా నిలిచారు. ఆపదలో ఉన్న వారికి మానవత్వంతో చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. డాక్టర్ ఎంఏ హకీమ్ అందించిన సహాయాన్ని స్థానికులు అభినందించారు. ఈ సామాజిక సేవా కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్, నాయకులు, అప్రోచ్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# నాన్ ఏజెన్సీ గ్రామాలను ఏజెన్సీలో కలపాలి

◆ ఆదివాసీల చట్టాలను హరిస్తున్న కేంద్ర బీజేపీ, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు.
◆ దసలీ రైతులు పై అటవీ శాఖ అధికారుల దౌర్జన్యాలు అరికట్టాలి.
◆ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం(టీ ఏ జి ఎస్ ) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్

మంచిర్యాల జిల్లా, చెన్నూరు, ఆగష్టు 13(జనసంఘర్షణ):

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో చెన్నూరు పట్టణంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి.ఆదివాసీల సాంస్కృతిక ప్రదర్శనలు, భారీ ర్యాలీల ద్వారా వారి ఐక్యతను సమాజానికి చాటిచెప్పారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ హాజరై మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం 1994లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.. దేశంలో (జార్ఖండ్ , ఒడిశా, ఛత్తీస్ ఘడ్ మణిపూర్,) వారి నివసిస్తున్న మైనింగ్, కనిజ వనరుల ను కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్తూ ఆదివాసులపై తీవ్రమైన దాడులను ఎదుర్కొంటున్నారని, వారిని అడవుల నుంచి తరిమేస్తూ భూములు లాక్కుంటున్నారని ఆరోపించారు..నరేంద్ర మోడీ మరియు కాంగ్రెస్ ప్రభుత్వాలు అడవులను ప్రైవేటీకరిస్తూ, ఆదివాసులను అడవులకు దూరం చేసేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.. సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా, ఫారెస్ట్ అధికారులను పంపి దాడులు చేయించడం






దారుణమని పేర్కొన్నారు..సాగులో ఉన్న ప్రతి పోడు భూమికి తక్షణమే పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు..ఆదివాసులపై ఫారెస్ట్ అధికారుల దాడులను పూర్తిగా నిలిపివేయాలని కోరారు..100% ఆదివాసులు నివసించే నాన్-ఏజెన్సీ గ్రామాలను షెడ్యూల్డ్ జాబితాలోకి మార్చాలని తెలిపారు..ఆదివాసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రత్యేక చట్టాలు తెవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి భాగాల రాజన్న, ఎర్మ పున్నం మాట్లాడుతూ ఈ ప్రాంతం లో అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్న దసలీ రైతుల కు జీవనోపాధి కల్పించడానికి పరిశ్రమ ఏర్పాటు చేశారు కానీ ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మూలంగా పరిశ్రమ మూతబడి ఎలాంటి జీవనోపాధి లేనటువంటి ఆదివాసీల పై అటవీ అధికారుల దాడి నీ ఖండిస్తున్నామన్నారు స్థానిక మంత్రి వివేక్ గారికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఆదివాసి గ్రామాలకు సరైన రోడ్డు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని అన్నారని. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర సహకార కార్యదర్శి పొలం రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మల్లేశ్వరి, వృత్తిదారుల రాష్ట్ర నాయకులు ఆశయ, వ్యవసాయ కార్మిక సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు పోలం రాజేందర్, ఐద్వా జిల్లా కార్యదర్శి ఉమారాణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మోహన్, కిసాన్ మిత్ర జిల్లా కోఆర్డినేటర్ సిడం రమేష్, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు తలండి ముత్తయ్య, సిడం సమ్మక్క, సుమలత, ఆలం మదనయ్య, వెంకన్న, సంపత్, మల్లేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
శుక్రవారం 14 ఆగస్టు 2026

# నేరాల నియంత్రణలో అలసత్వం వద్దు.. ఉక్కుపాదం మోపండి!

- ◆ డ్రగ్స్, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి.. పాత నేరస్థులపై నిఘా కట్టుదిట్టం
- ◆ రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్‌లు.. పండుగల నేపథ్యంలో 24/7 బందోబస్తు
- ◆ చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతర దాడులు.. అవసరమైతే పీడీ యాక్ట్

కోటగిరి,/ ఆగస్టు 13/జన సంఘర్షణ)

నేరాల నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదని, శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహించే పోలీసు అధికారులపై బాధ్యత వహించాల్సి ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ స్పష్టం చేశారు. బోధన్ డివిజన్ పరిధిలో పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, శాంతిభద్రతలపై కోటగిరి పోలీస్ స్టేషన్‌లో ఆయన సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ, సీసీఆర్‌బీ అధికారులు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌ఐలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**డ్రగ్స్ దందాకు చెక్.. అవసరమైతే పీడీ యాక్ట్**

రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దాడులు మరింత ముమ్మరం చేయాలని కమిషనర్ ఆదేశించారు. గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని, అవసరమైతే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాలను ప్రయోగించాలని స్పష్టం చేశారు. పేకాట, గుట్కా, అక్రమ ఇసుక రవాణా, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం దాడులు కొనసాగించాలని ఆదేశించారు. అక్రమ దందాలకు పాల్పడేవారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపశమనం ఉండకూడదని హెచ్చరించారు.

**పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా**

బోధన్ డివిజన్ పరిధిలో నమోదైన హత్య, హత్యాయత్నం, చోరీలు, మహిళలపై నేరాలు, సైబర్ మోసాలు, డ్రగ్స్, గంజాయి తదితర కేసుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. పెండింగ్ కేసులను వేగంగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్థులు, బెయిల్‌పై బయట ఉన్న నిందితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా పెంచి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల తనిఖీలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు.

**సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి**

సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు పోలీసులు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

**మహిళల భద్రతకు పెద్దపీట**

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, షీ టీమ్స్, ఈగల్ టీమ్స్, చీతా ఫోర్స్ బృందాలు మరింత సమర్థవంతంగా పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. విద్యాసంస్థలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**రోడ్డు ప్రమాదాలపై ఇక నిర్లక్ష్యం వద్దు**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అవసరమైన సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. హైవేలను కలుపుతున్న లింక్ రోడ్ల వద్ద అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించడం, రోడ్లకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉంటే నేషనల్, స్టేట్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

**డయల్ 112పై విస్తృత ప్రచారం**

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే పోలీసులను సంప్రదించేలా డయల్ 112 సేవపై ప్రతి గ్రామం, ప్రతి ప్రాంతంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని తెలిపారు.

**పండుగల నేపథ్యంలో 24/7 నిఘా**

రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వాహనాల తనిఖీలను 24 గంటలూ, 7 రోజులూ అప్రమత్తంగా నిర్వహించాలని, తనిఖీల సమయంలో సిబ్బంది ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు.

**పోలీస్ స్టేషన్లలో ప్రజలకు గౌరవం**





పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారికి స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని కమిషనర్ సూచించారు. రిసెప్షన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. "శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై, వారికి సహకరించే వారిపై కఠిన చర్యలు తప్పవు. నేరాల నియంత్రణలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి" అని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఏసీపీ గురునాయుడు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు, ఎస్‌ఐలు, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు–రంగారెడ్డి డీపీఆర్‌ను కేంద్రం తిప్పిపంపడం దుర్మార్గం

- ❑ పోలవరం, బనకచర్లకు లేని అభ్యంతరాలు పాలమూరు-రంగారెడ్డికి ఎందుకు?
- ❑ ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రాజెక్టు ఆలస్యానికి ప్రధాన కారణం: డాక్టర్,, ఎం.ఏ. హకీం

పొతంగల్, /ఆగస్టు 13: /జన సంఘర్షణ

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వం తిప్పి పంపడంపై బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఏ. హకీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు కీలకమైన ఈ ప్రాజెక్టు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ప్రజలకు అన్యాయం చేసే విధంగా ఉందని విమర్శించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి పాలమూరు ప్రాంతంతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాలకు సాగునీరు అందే అవకాశం ఉందని, అలాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు డీపీఆర్‌ను తిరిగి పంపడం దుర్మార్గమని అన్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రశ్నల వర్షం**

"పోలవరం, బనకచర్ల ప్రాజెక్టులకు లేని అభ్యంతరాలు పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు ఎందుకు?" అని ఎం.ఏ. హకీం ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టుల విషయంలో ఎందుకు ఇలాంటి అడ్డంకులు ఎదురవుతున్నాయో కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాజెక్టు విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. డీపీఆర్‌ను కేంద్రం తిప్పి పంపే పరిస్థితి ఎందుకు వచ్చిందో ప్రజలకు వివరించాలని కోరారు.

**ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం**




పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని హకీం ఆరోపించారు. ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు, డీపీఆర్ అంశాలను వేగంగా పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని స్పష్టం చేశారు.తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసే ఏ నిర్ణయాన్నీ ప్రజలు సహించరని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అన్ని అనుమతులు సాధించి ప్రాజెక్టును పూర్తి చేసే వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పోరాడాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి డీపీఆర్‌పై ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి ప్రాజెక్టుకు మార్గం సుగమం చేయాలని డాక్టర్,,ఎం.ఏ. హకీం కోరారు.

# కానిస్టేబుల్ సాయికుమార్ మృతిపై కుటుంబ సభ్యుల ఆగ్రహం

- ◆ ఏసీపీ కార్యాలయంపై దాడి.. ఫర్నిచర్, కంప్యూటర్లు ధ్వంసం
- ◆ అధికారుల తీరుపై కుటుంబ సభ్యుల హెచ్చరిక

హైదరాబాద్/, ఆగస్టు 13/జన సంఘర్షణ,)



కానిస్టేబుల్ సాయికుమార్ మృతిపై కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయికుమార్ మృతికి సంబంధించిన అనుమానాలను నివృత్తి చేసి, అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఎల్బీనగర్ ఏసీపీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఏసీపీ అందుబాటులోకి రాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, బంధువులు మూకుమ్మడిగా ఏసీపీ కార్యాలయంలోకి వెళ్లి ఫర్నిచర్, కంప్యూటర్లను ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా వారు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాయికుమార్ మృతిపై నిష్పక్షపాతంగా, సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులెవరైనా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు స్థానిక సీఐ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య వాగ్వాదం జరగడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సాయికుమార్ మృతిపై న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గేది లేదని, కుటుంబ సభ్యుల అనుమానాలను నిర్లక్ష్యం చేస్తే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. అధికారుల స్పందన, తదుపరి పోలీసుల చర్యలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# బడికి రాని టీచర్లపై వేటు..ఏడాది అబ్సెంట్ అయితే డిస్మిస్..

- ❑ 5 ఏళ్లు దాటితే రాజీనామాగా పరిగణన..!!



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 13(జనసంఘర్షణ):
ప్రభుత్వ పాఠశాలల్లో విధులకు సక్రమంగా రాకుండా డమ్మీలు కొడుతున్న టీచర్లు, సిబ్బందిపై విద్యాశాఖ కొరడా ఝుళిపించింది. అనుమతి లేకుండా ఏడాది పాటు డ్యూటీకి రాకపోతే నేరుగా ఉద్యోగం నుంచి తొలగించాలని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ అన్ని జిల్లాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

**5 ఏళ్లు దాటితే ఆటో రిజైన్..!!**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ ఉద్యోగికైనా 5 ఏళ్లకు మించి సెలవు ఇవ్వడానికి అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఒకవేళ టీచర్ గానీ, ఇతర సిబ్బంది గానీ ఏడాదికి మించి అనుమతి లేకుండా గైర్హాజరైనా, లేదా 5 ఏళ్లు పూర్తిగా అబ్సెంట్ అయినా వారు ఉద్యోగానికి రాజీనామా చేసినట్లే భావించాలని స్పష్టం చేసింది. విదేశాల్లో ఉండి తిరిగి రాని వారికి కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది.

**అకడమిక్‌కు ఆటంకం..?**

టీచర్లు అనుమతి లేకుండా డ్యూటీకి రాకపోవడంతో బడుల్లో బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని గైర్హాజరైన వారిపై తక్షణం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈఓలకు ఆదేశాలు వెళ్లాయి. అబ్సెంట్‌ను గుర్తించగానే షోకాజ్ నోటీసు ఇచ్చి, సీసీఏ రూల్స్ ప్రకారం విచారణ మొదలుపెట్టాలని పేర్కొంది.

**అధికారులపైనా నిఘా..!!**

చర్యలు తీసుకోవడంలో జాప్యం చేసిన హెడ్ మాస్టర్లు, ఎంఈఓలు, డీఈఓలను కూడా బాధ్యులను చేస్తామని డైరెక్టర్ నవీన్ నికోలస్ హెచ్చరించారు. ప్రతి డీఈఓ ఆఫీసులో అబ్సెంట్ టీచర్ల రిజిస్టర్ మెయింటెన్ చేయాలని, ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. గైర్హాజరు కాలాన్ని 'డీస్ నన్' గా పరిగణించి ఇంక్రిమెంట్, పెన్షన్‌లో కోత విధించనున్నారు.

# కోటగిరిలో 8.86 కిలోల గంజాయి పట్టివేత

- ❑ నిందితుడి అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ
- ❑ మత్తు పదార్థాల విక్రయాలు, సరఫరాపై ఉక్కుపాదం: ఏసీపీ పి. శ్రీనివాస్






కోటగిరి/, ఆగస్టు 12:/జన సంఘర్షణ

గంజాయి అక్రమ రవాణాపై కోటగిరి పోలీసులు దృష్టి సారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోతంగల్ మంజీరా నది మొదటి బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు.. అనుమా నాస్పదంగా సంచితో నడుచుకుంటూ వస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన అతడిని పట్టుకుని, సంచిని తనిఖీ చేయగా 8.86 కిలోల గంజాయి బయటపడింది. దీంతో పాటు ఒక వివో మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో పట్టుబడిన వ్యక్తిని లిపెద్దకొడపగల్ మండలం పోచారం తండాకు చెందిన బర్దల్ పాచిరం (38)లిగా గుర్తించారు. ఇల్లు నిర్మాణం కారణంగా అప్పులు పెరగడంతో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి వ్యాపారంలోకి వచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. పాచిరానికి రాందాస్ అనే వ్యక్తి ద్వారా ఒడిశాకు చెందిన చోటుతో పరిచయం ఏర్పడిందని, అతడి ద్వారా గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలోనూ గంజాయి సరఫరాకు సంబంధించి నిందితుల మధ్య సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ కేసులో రాందాస్, సాథి, చోటు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిందితులపై చీణూా చట్టం-1985లోని 8(ఎ) తీ/ష 20(ఎ)(ఱఱ)(జ), 29 సెక్షన్ల కింద జతీ.చీశీ.129/2026 నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.44,300 ఉంటుందని పోలీసులు తెలిపారు.

**పోలీసు బృందానికి అభినందనలు**

కేసు దర్యాప్తులో సహకరించిన ఏసీపీ సీసీఎస్ శ్రీశైలం, బోధన్ ఏసీపీ పి. శ్రీనివాస్, రుద్రూరు సీఐ కృష్ణ, కోటగిరి ఎస్ఐ శ్రీనివాస్, రుద్రూరు ఎస్ఐ మనోజ్, సీసీఎస్ ఎస్ఐ శ్రీనివాస్, ఈగల్ టీం, చీతా ఫోర్స్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

**మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తప్పవు**

గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను విక్రయించినా, సరఫరా చేసినా, రవాణా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఏసీపీ పి. శ్రీనివాస్ హెచ్చరించారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# పోచారం శ్రీనివాస్ రెడ్డి దారి ఎటు?

- కాంగ్రెస్‌లో ఉంటారా? బీఆర్‌ఎస్‌లోకి వెళ్తారా?
- పోచారం నిర్ణయంపై అనుచరుల్లో ఉత్కంఠ.. బీఆర్‌ఎస్‌లోకి నో ఎంట్రీ అంటున్న మాజీ ఎమ్మెల్యే

కామారెడ్డి (ప్రతినిధి/ఆగస్ట్ 13/జన సంఘర్షణ)
నాలుగు దశాబ్దాలుగా బాన్సువాడ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న సీనియర్ నేత పోచారం శ్రీనివాస్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ సాగుతోంది. కాంగ్రెస్‌లో కొనసాగుతారా? తిరిగి బీఆర్‌ఎస్ గూటికి చేరుతారా? అన్నది నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. ఆయన తదుపరి నిర్ణయం కోసం అనుచరులు, కార్యకర్తలు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

**కేసీఆర్‌తోనే ఉంటానని ప్రమాణం.. ఆ తర్వాత కాంగ్రెస్‌లోకి**

గతంలో బీర్కూర్--తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాల్గొన్న సభలో, శాసనసభాపతి హోదాలో ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి కేసీఆర్‌తోనే ఉంటానని ప్రమాణం చేసిన విషయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాన్సువాడ నుంచి విజయం సాధించిన పోచారం శ్రీనివాస్ రెడ్డి అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లోకి వెళ్లానని, కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, జాతీయ జెండాను మాత్రమే కప్పుకున్నానని ఆయన అప్పట్లో వివరణ ఇచ్చారు. అయితే ఆయన పార్టీ మార్పు వెనుక కుటుంబ సభ్యుల సూచనలు కూడా ఉన్నాయన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగింది.

**బాన్సువాడ కాంగ్రెస్‌లో రెండు వర్గాలు**

పోచారం కాంగ్రెస్‌లో చేరిన అనంతరం బాన్సువాడ రాజకీయాల్లో సమీకరణాలు మారిపోయాయి. కాంగ్రెస్ టికెట్ ఆశించి ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన ఏనుగు రవీందర్ రెడ్డి నియోజకవర్గంలో తన రాజకీయ బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తుండగా, పోచారం వెంట బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులు కొనసాగుతున్నారు. దీంతో బాన్సువాడ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య అంతర్గత విభేదాలు ఉన్నాయన్న చర్చకు మరింత బలం చేకూరింది.

**కాంగ్రెస్‌పై పోచారం అసంతృప్తి?**

ఇటీవల బీర్కూర్ వద్ద మంజీరా నదిపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను సందర్శించిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి రైతులు ఆత్మీయ సమ్మేళనం, వనభోజన కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు బాన్సువాడ రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఆశించిన స్థాయిలో సహకారం లభించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి, మంత్రులు తగిన సహాయం చేయడం లేదని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొంటూ గత ప్రభుత్వ పనితీరును ఆయన ప్రశంసించారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడే నాయకులకు తగిన గౌరవం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో సమన్వయం లోపించిందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలతో పోచారం కాంగ్రెస్‌పై అసంతృప్తితో ఉన్నారా? ఆయన తిరిగి బీఆర్‌ఎస్ వైపు అడుగులు వేస్తారా? అనే చర్చ జోరందుకుంది.

**పోచారానికి బీఆర్‌ఎస్‌లో నో ఎంట్రీ?**

ఇదే సమయంలో పోచారం శ్రీనివాస్ రెడ్డి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరనున్నారనే ప్రచారం రావడంతో ఆ పార్టీ నేతలు స్పందించారు. బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాత్రం పోచారానికి బీఆర్‌ఎస్‌లో తిరిగి చేరేందుకు అవకాశం లేదని స్పష్టం చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారాన్ని బట్టి రాజకీయంగా అడుగులు మార్చుకునే వ్యక్తిని తిరిగి పార్టీలోకి తీసుకునే ప్రసక్తి లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం. అలాగే ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బాల్కొండ మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కూడా బీఆర్‌ఎస్‌లో చర్చకు దారితీశాయి. పోచారం శ్రీనివాస్ రెడ్డిని తిరిగి పార్టీలోకి ఆహ్వానించే అంశంపై బీఆర్‌ఎస్ శ్రేణుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి స్పష్టత కోరగా, పోచారం ఓటమే తమ పార్టీ లక్ష్యమని ఆయన స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.దీంతో పోచారం తిరిగి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ప్రస్తుతానికి స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు.

**బీఆర్‌ఎస్ బలోపేతంపై సీనియర్ల దృష్టి**

మరోవైపు బాన్సువాడలో బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు బాజిరెడ్డి గోవర్ధన్, ప్రశాంత్ రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ తదితర సీనియర్ నేతలు దృష్టి సారిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పోచారం తిరిగి పార్టీలోకి వస్తారనే ప్రచారానికి ముందుగానే బీఆర్‌ఎస్ నేతల నుంచి వ్యతిరేక స్వరాలు వినిపిస్తుండటంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఉత్కంఠ మరింత పెరిగింది.





**“ఏనుగు రవీందర్ రెడ్డి దూకుడు**

ఇక బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి కూడా రాజకీయంగా దూకుడు పెంచారు. కొంతకాలంగా నిశ్శబ్దంగా ఉన్న ఆయన తాజాగా నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసే కార్యక్రమాలపై దృష్టి సారించారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన చేయడంతో పాటు, అక్కడ సొంత ఇంటి నిర్మాణానికి కూడా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నీ బాన్సువాడ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరతీస్తున్నాయి.

**ఇక పోచారం అడుగు ఎటు?**

ఒకవైపు కాంగ్రెస్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి.. మరోవైపు బీఆర్‌ఎస్‌లోకి ఆయనకు తలుపులు మూసుకున్నట్లు ఆ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నేతలు స్పష్టం చేస్తుండటంతో ఆయన రాజకీయ ప్రయాణం ఆసక్తికరంగా మారింది. కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? బీఆర్‌ఎస్‌లోకి తిరిగి వెళ్తారా? లేక మరో రాజకీయ నిర్ణయం తీసుకుంటారా? అన్నది ప్రస్తుతం బాన్సువాడ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. పోచారం శ్రీనివాస్ రెడ్డి తదుపరి రాజకీయ అడుగు ఏమిటన్నది కాలమే నిర్ణయించాలి.

# హెచ్‌సీయూలో గంజాయి కలకలం.. 17 మంది విద్యార్థులకు పాజిటివ్

- పూర్వ విద్యార్థే డ్రగ్ పెడ్లర్‌గా గుర్తింపు..
- 10 గ్రాముల గంజాయి స్వాధీనం
- క్యాంపస్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదు..
- విద్యార్థులకు అధికారుల ఘాటు హెచ్చరిక

హైదరాబాద్,/ ఆగస్టు 13: /జన సంఘర్షణ
ప్రతిష్టాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో గంజాయి వ్యవహారం తీవ్ర కలకలం రేపింది. క్యాంపస్‌లో విద్యార్థులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారంతో ఈగల్ టీమ్, గచ్చిబౌలి పోలీసులు చేపట్టిన ఆకస్మిక తనిఖీల్లో పలువురు విద్యార్థులకు డ్రగ్ టెస్టులు నిర్వహించారు. ఈ పరీక్షల్లో 17 మంది విద్యార్థులకు గంజాయి పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం.విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అస్సాం నుంచి గంజాయి తీసుకొచ్చి క్యాంపస్‌లోని విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తి హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి అని పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. అతని వద్ద నుంచి సుమారు 10 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. క్యాంపస్‌లోకి మాదకద్రవ్యాలు ఎలా చేరుతున్నాయి? వీటి వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

**డ్రగ్స్‌పై అధికారులు ఉక్కుపాదం**

విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మాదకద్రవ్యాలకు క్యాంపస్‌లో ఏమాత్రం అవకాశం ఇవ్వబోమని అధికారులు హెచ్చరించారు. గంజాయి సేవించడం, విక్రయించడం, సరఫరా చేయడం లేదా డ్రగ్స్‌కు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.“చదువుకోవాల్సిన వయసులో డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు. డ్రగ్స్ సరఫరా చేసే వారితో సంబంధాలు పెట్టుకుంటే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది” అని అధికారులు విద్యార్థులను హెచ్చరించారు.అదేవిధంగా డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులకు సహకరించే వారిపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో అనుమానాస్పద వ్యక్తులు, డ్రగ్స్ సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.




**తల్లిదండ్రుల్లో ఆందోళన**

ప్రతిష్టాత్మక విద్యాసంస్థలోనే గంజాయి వ్యవహారం వెలుగులోకి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్యాంపస్‌లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి, డ్రగ్స్ సరఫరా చేసే నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్యాంపస్‌ను డ్రగ్స్ రహిత ప్రదేశంగా మార్చాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

# కామారెడ్డి జిల్లాలో విషాదం ఆరోగ్య సమస్యలతో యువతి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట,/ ఆగస్టు 13:/జన సంఘర్షణ)
కామారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. నాగిరెడ్డిపేట మండలం ధర్మారెడ్డి గ్రామ తండాకు చెందిన కేతావత్ జ్యోతి (25) ఆరోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ తెలిపారు. జ్యోతి కొంతకాలంగా ఫిట్స్ తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై పురుగు మందు తాగినట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి అన్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ గౌడ్ వెల్లడించారు.



# నిజామాబాద్ జిల్లాలో దారుణం

- ముళ్లపొదల్లో అప్పుడే పుట్టిన ఆడశిశువు

నిజామాబాద్ బ్యూరో/ఆగస్టు 13/జన సంఘర్షణ



నిజామాబాద్ జిల్లాలో మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగుచూసింది. అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు ముళ్లపొదల్లో వదిలేసిన ఘటన మోపాల్ మండల కేంద్రంలో కలకలం రేపింది. మోపాల్ గురుకుల పాఠశాల సమీపంలోని ముళ్లపొదల్లో పసికందు ఏడుపు వినిపించడంతో స్థానికులు అక్కడికి వెళ్లి చూడగా, అప్పుడే పుట్టిన ఆడశిశువు కనిపించింది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, వైద్య సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పసికందును సురక్షితంగా బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చిన్నారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. శిశువు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

**ఆడపిల్ల పుట్టిందనే కారణంతోనా?**

పసికందును ముళ్లపొదల్లో పడేసిన ఘటనపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆడపిల్ల పుట్టిందనే కారణంతో పెంచే స్థోమత లేక తల్లిదండ్రులు వదిలేసి ఉంటారా? లేక పెళ్లికాని యువతి గర్భం దాల్చి, విషయం బయటకు తెలియకుండా శిశువును ఇలా వదిలేసి వెళ్లారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే శిశువును ఎవరు వదిలి వెళ్లారు, అసలు కారణం ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది.

వరుస ఘటనలతో ఆందోళన

వారం రోజుల క్రితం సంగారెడ్డి జిల్లా సదాశివపేట బస్టాండ్‌లోని మూత్రశాలలో చిన్నారిని వదిలివెళ్లిన ఘటన మరువకముందే నిజామాబాద్ జిల్లాలో మరో పసికందును ఇలా నిర్దాక్షిణ్యంగా వదిలేయడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కన్నబిడ్డను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లిదండ్రులే.. ముళ్లపొదల్లో వదిలేయడం ఎంతటి దారుణమో ఈ ఘటన అద్దం పడుతోంది. శిశువును వదిలేసిన వారి ఆచూకీని పోలీసులు గుర్తించి, వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## 220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటిక స్వాధీనం



- నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిసరుకుతో ఇద్దరు పట్టుబాటు..
- కేసు నమోదు

నిజామాబాద్ బ్యూరో/ఆగస్ట్ 13/(జన సంఘర్షణ)
నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిసరుకును అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి భారీగా నల్లబెల్లం, పటికతో పాటు ఓ కారు స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీధర్, కామారెడ్డి జిల్లా మద్యనిషేధ, ఎక్సైజ్ అధికారి ముకుందరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా, నాటుసారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, పటికను తరలిస్తున్నట్లు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆ ముడిసరుకును విక్రయించిన మరో వ్యక్తి వివరాలు బయటపడినట్లు అధికారులు తెలిపారు. దీంతో అతడిని కూడా పట్టుకున్నారు.

**220 కిలోల నల్లబెల్లం.. 64 కిలోల పటిక**

ఇద్దరి వద్ద నుంచి మొత్తం 220 కిలోల నల్లబెల్లం, 64 కిలోల పటికతో పాటు ఒక ఇండికా కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ హెచ్చరించారు. నాటుసారా తయారీకి ఉపయోగించే ముడిసరుకుల అక్రమ రవాణాపైనా నిఘా కొనసాగిస్తామని తెలిపారు.

**దాడిలో పాల్గొన్న అధికారులు**

ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జాన్ బల్వంతరావు, కానిస్టేబుళ్లు గోరి, పవన్ కుమార్, రాజునాయక్, బాబు, శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

**రూ.30 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన అధికారి**

కరీంనగర్/ఆగస్ట్ 13/జన సంఘర్షణ)


Press Note No. 114 Dated: 13.08.2026

SRI. MANCHIKATLA RAHUL, REVENUE INSPECTOR, BEERPUR(V&M), JAGTIAL DISTRICT IN ACB NET

On 13.08.2026, the Accused Officer (AO), Sri Manchikatla Rahul, working as Revenue Inspector, Beerpur (V&M), Office of the Tahsildar, Beerpur (V&M), Jagtial District, was caught by the ACB Karimnagar Unit at the complainant's residence situated at Siripuram Colony, Beerpur, while accepting Rs.30,000/- out of the agreed bribe amount of Rs.40,000/- from the complainant. The AO had initially demanded Rs.50,000/- as bribe from the complainant for showing official favour, i.e., "to conduct a field survey of the complainant's land and issue a report for registration and issuance of Pattadar Pass Book".

On the request of the complainant, the AO agreed to reduce the bribe amount to Rs.40,000/-, out of which Rs.30,000/- was agreed to be paid on 13.08.2026 and the remaining Rs.10,000/- after completion of the work. Accordingly, the AO accepted Rs.30,000/- from the complainant and was caught by the ACB officials.

The tainted bribe amount of Rs.30,000/- was recovered from the possession of the AO. Thus the Accused Officer performed his duty improperly and dishonestly to obtain undue advantage of his official position

The AO was arrested and is being produced before the Hon'ble Special Judge for SPE & ACB Cases, Karimnagar. The case is under investigation. The details of the complainant are withheld for security reasons.

CELL PHONE NUMBER -1064 (TOLL FREE NUMBER):

In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms Whatsapp(9440446106), Facebook(Telangana ACB), X/formerly Twitter (@Telangana ACB). The name and details of the victim/complainant will be kept secret.

13/8/26.
P.R.O,
Anti-Corruption Bureau,
TG., Hyderabad.

జగిత్యాల: అవినీతి నిరోధక శాఖ వలలో మరో ప్రభుత్వ అధికారి చిక్కారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మంచికట్ల రాహుల్ రూ.30 వేల లంచం తీసుకుంటూ కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. అవినీతి నిరోధక శాఖ విడుదల చేసిన పత్రికా ప్రకటన నంబర్ 114 ప్రకారం.. బీర్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్.. ఫిర్యాదుదారుడి భూమికి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, రిజిస్ట్రేషన్‌తో పాటు పట్టాదారు పాస్‌బుక్ జారీకి అవసరమైన నివేదిక అందించేందుకు తొలుత రూ.50 వేల లంచం డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడి అభ్యర్థన మేరకు లంచాన్ని రూ.40 వేలకు తగ్గించేందుకు అధికారి అంగీకరించారు. అందులో రూ.30 వేలు ఆగస్టు 13న, మిగిలిన రూ.10 వేలు పని పూర్తయిన తర్వాత ఇవ్వాలని ఒప్పందం కుదిరింది.

**రూ.30 వేలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా..**

ఒప్పందం ప్రకారం గురువారం ఫిర్యాదుదారుడి బీర్‌పూర్‌లోని శ్రీపురం కాలనీలో ఉన్న నివాసం వద్ద నుంచి రూ.30 వేల లంచం స్వీకరిస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రాహుల్‌ను పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్ము రూ.30 వేలను స్వాధీనం చేసుకున్నారు. అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ అక్రమ ప్రయోజనం పొందేందుకు విధులను నిజాయితీగా నిర్వర్తించలేదని అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు.

**ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు**

నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని అవినీతి నిరోధక శాఖ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నట్లు అధికారులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను అధికారులు వెల్లడించలేదు.

**లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి**

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు అవినీతి నిరోధక శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అవినీతి నిరోధక శాఖను వాట్సాప్ నంబర్ 9440446106, సామాజిక మాధ్యమ వేదికల ద్వారా కూడా సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

లంచం అడిగితే మౌనం వద్దు.. అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేయండి!

# నియోజకవర్గ ప్రజల కోసం ఏ త్యాగానికైనా సిద్ధం

**నేను అమ్ముడు పోయే వ్యక్తిని కాదు.. డబ్బులు తీసుకునే వ్యక్తినీ కాదు: పోచారం శ్రీనివాస్‌రెడ్డి**

బాన్సువాడ, /ఆగస్టు 13: జన సంఘర్షణ



నియోజకవర్గ ప్రజల కోసం ఏమైనా చేయడానికి, ఎలాంటి త్యాగానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో ఏడు దఫాలుగా ప్రజాప్రతినిధిగా సేవ చేసే అవకాశం తనకు లభించిందని తెలిపారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జాకోరా గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తనపై వస్తున్న విమర్శలు, వ్యాఖ్యలపై స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదని, ఎవరి వద్దా డబ్బులు తీసుకునే వ్యక్తిని కాదని పోచారం స్పష్టం చేశారు. తనకు స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయంటూ కొందరు బుద్ధిహీనులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించాల్సిన అవసరం లేదన్నారు.

గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను ప్రశంసించిన సందర్భంలో, ఆ పనులు కేసీఆర్ హయాంలో జరిగాయి కాబట్టే తాను ప్రస్తావించానని వివరించారు. అదే విధంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరిస్తానని తెలిపారు. ప్రజల కోసమే తన జీవితం అంకితం చేశానని, ప్రజలకు అనుకూలంగా పనిచేయడమే తన లక్ష్యమని పోచారం పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరి పేరును ప్రస్తావించడం తన ధర్మం, మానవత్వమన్నారు. అభివృద్ధి పనుల్లో సహకరించిన వారిని గుర్తించి వారికి కృతజ్ఞతలు చెప్పడంలో తప్పేమీ లేదని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో ఇన్నేళ్లుగా ప్రజాసేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టమని పేర్కొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ ప్రజల కోసం ఎంతవరకైనా వెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని మరోసారి స్పష్టం చేశారు.

# వికలాంగుల రాష్ట్ర కమిటీ సమావేశాలను విజయవంతం చేయాలి

**సెప్టెంబర్ 1 నుంచి బోధన్‌లో రాష్ట్రస్థాయి సమావేశాలు**

నిజామాబాద్, /ఆగస్టు 13/జన సంఘర్షణ:






బోధన్ పట్టణంలోని అప్పా ఫంక్షన్ హాల్‌లో సెప్టెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న వికలాంగుల రాష్ట్ర కమిటీ సమావేశాలు, సదస్సులను విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏషాల గంగాధర్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటలకు బాన్సువాడ ఎమ్మెల్యే, వ్యవసాయ శాఖ రాష్ట్ర సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ రాష్ట్ర చైర్మన్ కాసుల బాలరాజు తదితర ప్రముఖులు సమావేశాలకు హాజరవుతారని తెలిపారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వికలాంగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వికలాంగుల హక్కులు, చట్టాలు, అలాగే వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించనున్నట్లు గంగాధర్ తెలిపారు. వికలాంగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్రీ=ణ జిల్లా అధ్యక్షులు గైని రాములు, రుద్రూర్ మండల అధ్యక్షులు జల్లాపురం సాయిలు, వర్ని మండల అధ్యక్షులు సభావత్ గోపాల్, మండల కార్యదర్శి మాదారి బోయి సాయిలు, బొడ్డు సాయిలు, వర్ని మండల నాయకులు మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పోతంగల్‌లో పెద్ద పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

**గ్రామ ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి**

పోతంగల్, /ఆగస్టు 13: /జన సంఘర్షణ




పోతంగల్ మండలంలోని కొత్త పోతంగల్ గ్రామంలో పెద్ద పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆగస్టు 14న ఉదయం 8:30 గంటలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ కార్యక్రమానికి హాజరై ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ విజ్ఞప్తి చేసింది. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన పెద్ద పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్తుల సహకారం ఎంతో అవసరమని కమిటీ సభ్యులు తెలిపారు. భూమిపూజ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వట్టి ఉపేందర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**ఎర్ర యాకన్న అధ్యక్షులు (టిడబ్ల్యూజేఎఫ్)**

హైదరాబాద్ సిటీ, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి అంజిబాబు నాగుల, ఆగస్టు 13, (జన సంఘర్షణ):



కూకట్పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ రోడ్ నెంబర్ 1 కేపీహెచ్బి కమ్యూనిటీ హాల్ లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వట్టి ఉపేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు కేకు కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) కూకట్పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య హాజరై శాలువా, పూల బొకేతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి టిడబ్ల్యూ జేఎఫ్ ప్రధాన కార్యదర్శి అంజిబాబు నాగుల (జనరల్ సెక్రటరీ), కార్యవర్గ సభ్యులు సుజాత, సభ్యులు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో గణేష్ ఉత్సవాల సమన్వయ సమావేశం

**హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ ప్రకటన**

హైదరాబాద్ /(ఆగస్టు 13, /జన సంఘర్షణ




రాబోయే వినాయక చతుర్థి ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లపై చర్చించేందుకు గురువారం (ఆగస్టు 13, 2026) చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కీలక సమన్వయ సమావేశం (జశీశీతీఎఱఅఱ్‌ఱశీఅ వీవవ్‌ఱఅస్త్ర) నిర్వహించారు. హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ట్రాఫిక్-3 డీసీపీ రాహుల్ హెగ్డే బి.కె., ఐపీఎస్, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కె. సత్యనారాయణ సంయుక్తంగా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జోన్‌కు చెందిన ట్రాఫిక్, లా ఑ ఆర్డర్ ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు (ఎస్‌హెచ్‌ఓ/ఇన్‌స్పెక్టర్లు), పలు ప్రభుత్వ శాఖల అధికారులు, అలాగే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలను అత్యంత వైభవంగా, సురక్షితంగా మరియు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడానికి చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఉత్సవాల ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, వివిధ శాఖల మధ్య అంతర్గత సమన్వయం , భక్తుల రద్దీ నియంత్రణ, ఇతర అవసరమైన జాగ్రత్తలపై సమగ్రమైన ప్రణాళికలను రూపొందించారు.

# రుద్రూర్ చెరువులో వ్యక్తి మృతి

రుద్రూర్,/ ఆగస్టు 13:/జన సంఘర్షణ)



రుద్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ చెరువులో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. రుద్రూర్ మండల కేంద్రంలోని జేఎన్సీ కాలనీకి చెందిన మంచ సాయిలు (50) కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కొంతకాలంగా వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైన సాయిలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు మంచ సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రుద్రూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తులో వెల్లడిస్తామని రుద్రూర్ ఎస్సై మనోజ్ కుమార్ తెలిపారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co